



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM



# ఉప్పును అధికంగా తీసుకుంటున్నారా?

ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. మూత్రపిండాల వ్యాధులకు దారితీస్తుంది. అలాగే బీపీతో పాటు మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. అధిక దాహం వంటి సమస్యలు ఎదురవుతాయి. జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదని సూచిస్తున్నారు.



# నేటి నుంచే పవన్ ప్రచారం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం నేటి నుంచే ప్రారంభం కానుంది. పవన్ పోటీ చేసే పిఠాపురంలో రెండు విడతలుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. తొలి విడతలో దాదాపు 10 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు.

**ఇదే షెడ్యూల్**

- మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు-పిఠాపురం
- ఏప్రిల్ 3న తెనాలి
- ఏప్రిల్ 4న నెల్లిమర్ల
- ఏప్రిల్ 5న అనకాపల్లి
- ఏప్రిల్6న యలమంచిలి
- ఏప్రిల్7న పెందుర్తి
- ఏప్రిల్ 8న కాకినాడ రూరల్ నియోజకవర్గం
- ఏప్రిల్ 9న పిఠాపురంలో ఉగాది వేడుకలు
- ఏప్రిల్ 10న రాజోలు
- ఏప్రిల్ 11న పి.గన్నవరం
- ఏప్రిల్ 12న రాజానగరం

ఈ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో పవన్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలను జనసైనికులు, వీరమహిళలు విజయవంతం చేయాలని నాదెండ్ల మనోహర్ కోరారు. ఈ సమావేశ్లలో పవన్ బహిరంగ సభతో పాటు పార్టీ ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తారు. మరోవైపు వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో భారీ అవినీతి జరిగిందని జనసేన PAC ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదన్న సీఎం జగన్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 2వేల కోట్లతో కొనుగోలు చేసిన 4లక్షలకుపైగా గేదెలు ఏమయ్యాయని నాదెండ్ల ప్రశ్నించారు. అవినీతిపై ఫిర్యాదు చేసేందుకు జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్‌కే 8లక్షల 3వేల 612 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు

# రాహుల్ ప్రత్యర్థిపై 242 క్రిమినల్ కేసులు



కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి సురేంద్రన్‌పై 242 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈసీ నిబంధనల మేరకు ఆయన తనపై ఉన్న కేసుల వివరాలను 3 పేజీల్లో వెల్లడించారు. అలాగే ఎర్నాకులం బరిలో ఉన్న కేఎస్ రాధాకృష్ణన్‌పై 211 కేసులు ఉన్నాయి. వీటిలో ఎక్కువ కేసులు 2018 శబరిమల ఆందోళనల్లో నమోదైనవేనని ఆ పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ జార్జ్ కురియన్ తెలిపారు.



# సీపీఎం మొదటి లిస్ట్ విడుదల

రానున్న లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం తమ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 44 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. చాలా రాష్ట్రాల్లో ఒకటీ రెండు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం.. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లకు తమ అభ్యర్థులను వెల్లడించింది. ఈ జాబితాలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 17 స్థానాలు ఉన్నాయి. కేరళకు చెందిన 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందులో అలప్పుజా నుంచి సిట్టింగ్ ఎంపీ ఆరిఫ్, వడకర నుంచి మాజీ ఆరోగ్య మంత్రి కేకే శైలజ టీచర్, కాజీకోడ్ నుంచి రాజ్యసభ ఎంపీ ఎలమరం కరీం ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని 17 పేర్లలో ముర్షిదాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం పేరు కూడా ఉంది. ఈ జాబితాలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అభ్యర్థులు ఉన్నారు. మధురై నుంచి సిట్టింగ్ ఎంపీలు ఎస్ వెంకటేశన్, దిండిగల్ ఆర్ సచ్చిదానందంలకు టిక్కెట్లు ఇచ్చారు. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలోని భువనగిరి స్థానానికి ఎండీ జహంగీర్ పేరును, ఆంధ్ర ప్రదేశ్‌లోని అరకు స్థానానికి పాచిపెంట అప్పలనరస పేరును మొదటి జాబితాలో వెల్లడించింది.



# భారతరత్న ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు భారతరత్న అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో భారతరత్న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల భారతరత్న పొందిన వారు అవార్డులను స్వీకరించారు. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్.. అలాగే, ఎమ్ఎస్ స్వామినాథన్, బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌ను మరణానంతరం భారతరత్న అవార్డు వరించింది. మాజీ ప్రధాని పీవీ నరసింహరావు తరపున భారతరత్న పురస్కారం అందుకున్న ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్ రావు. చౌదరి చరణ్ సింగ్ తరపున భారతరత్న పురస్కారం అందుకున్న ఆయన కుమారుడు జయంత్ చౌదరి. మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ తరపున భారతరత్న పురస్కారం అందుకున్న ఆయన కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్. స్వామినాథన్ తరపున భారతరత్న పురస్కారం అందుకున్న ఆయన కుమార్తె డాక్టర్ నిత్య. అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయిన బీజేపీ సీనియర్ నేత అద్వానీ. దీంతో, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ రేపు(ఆదివారం) ఎల్‌కే అద్వానీ ఇంటికి వెళ్లి అవార్డును అందించనున్నారు. అయితే, ఇటీవలే ఐదు గురికి కేంద్రం భారతరత్న అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగానే నేడు భారతరత్నల ప్రదానం జరిగింది. ఇక, ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీవీ కుటుంబ సభ్యుల హర్షం..

పీవీ నరసింహారావుకు భారత రత్న ఇవ్వడం సంతోషంగా ఉంది -శారద, పీవీ నరసింహారావు కూతురు దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు సరైన దిశలో నడిపించారు. ఆయన చేసిన కృషికి భారతరత్న అవార్డు నిదర్శనం. నరేంద్ర మోదీకి ధన్యవాదాలు.- జస్టిస్ శ్రవణ్ కుమార్, పీవీ మనవడు యూపీఏ హయంలోనే పీవీకి భారతరత్న రావాలి. అవార్డు ఆలస్యం అయినా, ఎన్డీఏ ప్రభుత్వం గుర్తించడం సంతోషం. పీవీ నరసింహారావుకు అనేక అవమానాలు జరిగాయి. ఆయన చేసిన మంచి పనులు కాంగ్రెస్ ఖాతాలో వేసుకున్నారు- సుభాష్ , పీవీ.మనవడు.

# మూడు స్వర్ణాలు సాధించిన 92ఏళ్ల వృద్ధురాలు..

బికనీర్ జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఇలాంటి అద్భుతం చేసింది. దీని గురించి తెలిస్తే ప్రతి ఒక్కరూ షాక్ అవుతారు. బికనీర్‌లోని నోఖా తహసీల్‌లోని అంఖిసర్ గ్రామంలో నివసిస్తున్న 92 ఏళ్ల గ్రామీణ మహిళ పనా దేవి గోదారా మూడు బంగారు పతకాలను గెలుచుకుంది. పనా దేవి ఇటీవల పూణేలో జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2024లో పాల్గొని మూడు బంగారు పతకాలను (100మీ, షాట్‌పుట్, డిస్కస్ త్రో) గెలుచుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆడేందుకు పనా దేవి ఇప్పుడు ఆగస్టులో స్వీడన్‌కు వెళ్లనుంది. తన విజయ మంత్రాన్ని, తన ఆరోగ్యాన్ని వివరించిన పనా దేవి.. తానెప్పుడూ ఫాస్ట్‌ఫుడ్, క్యాన్డ్ ఫుడ్, చల్లని నీరు వంటివి తీసుకోలేదని చెప్పింది. ఇదే ఆమె ఆరోగ్య రహస్యం. ఉదయాన్నే నిద్రలేచి ఇంటి పనుల్లో సహాయం చేయడం వారి రోజువారీ షెడ్యూల్‌లో భాగం. అంతేకాదు తాను ఎలాంటి మందులు వేసుకోనని, ఏళ్లతరబడి ఎలాంటి మందులు తీసుకోలేదని చెప్పింది. చదువుకు వయసు లేదు అని చెప్పినట్లే.. ఆడుకునే వయసు కూడా లేదు అంటూ 92 ఏళ్ల పనా దేవి గోదార మనవడు జై కిషన్ గోదార తన నాయనమ్మను ఆడిపాడేందుకు ప్రేరేపించాడు. జై కిషన్ తాను జాతీయ క్రీడాకారుడు. చాలా కాలంగా అతను పిల్లలను వివిధ క్రీడలను అభ్యసించేలా చేస్తున్నాడు. ఒకరోజు ఆమె చేసే పనిని గమనిస్తుందనే నెపంతో అమ్మమ్మని తనతో పాటు స్టేడియానికి తీసుకెళ్లాడు. ఆ రోజు తర్వాత అమ్మమ్మ ఎప్పుడూ నాతో కర్ణి సింగ్ స్టేడియానికి రావడం ప్రారంభించిందని జై కిషన్ చెప్పాడు. ఆ తర్వాత ఓ రోజు అమ్మమ్మ తనకు కూడా ఆడాలని ఉందని చెప్పింది. మనవడు అమ్మమ్మను ప్రోత్సహించడంతో ఆమె ఈ స్థాయికి చేరుకుంది. నేషనల్ గేమ్స్ యాక్టివిటీలో పాల్గొని తిరిగి వచ్చిన పనా దేవి ఇప్పుడు ఆ గ్రామంలోని మహిళలను గేమ్స్ యాక్టివిటీలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది. అమ్మమ్మ విజయం తర్వాత గ్రామంలోని మహిళలు ఆమెను కలవడానికి రావడం ప్రారంభించారని ఆమె మనవడు జై కిషన్ గోదార తెలిపారు. ఐదుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్ల తల్లి అయిన పనా దేవి ఆరోగ్యంగా ఉన్నారని గ్రామస్తులకు తెలుసని, అయితే జాతీయ స్థాయిలో ఆడి గ్రామానికి కీర్తి తెస్తారని ఎవరూ అనుకోలేదని గోదార చెప్పారు.





# కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం చోటుచేసుకుంది. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ సమక్షంలో ఆమె హస్తం గూటికి చేరుకున్నారు. కాగా, కొద్దిరోజులుగా మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు ఆమె హస్తం గూటికి చేరారు. ఈరోజు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ నివాసానికి చేరుకున్న విజయలక్ష్మి.. సీఎం, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక, అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కూడా హస్తం తీర్థం పుచ్చుకున్నారు.



# కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన శివరాజ్ పాటిల్ కోడలు

లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ తరుణంలో మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కోడలు అర్చన పాటిల్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం అర్చన పాటిల్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో బీజేపీలో చేరారు. శివరాజ్ పాటిల్ కాంగ్రెస్ సీనియర్ నేత. ఆయన లాతూర్ లోక్‌సభ స్థానం నుండి ఏడు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఇటీవల మహారాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. వీరిలో అశోక్ చవాన్, మిలింద్ దేవరా, బాబా సిద్ధిఖీ ఉన్నారు. అశోక్ చవాన్ బీజేపీలో చేరగా, మిలింద్ దేవరా ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో, బాబా సిద్ధిఖీ అజిత్ వర్గం నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు ఐదు దశల్లో జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 19న, రెండో దశ ఏప్రిల్ 26న, మూడో దశ మే 7న జరగనుంది. నాలుగో దశ మే 13న, ఐదో దశ పోలింగ్ మే 20న జరగనుంది. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది.

# వివాహేతర సంబంధం పెట్టుకుంటే రాళ్లతో కొట్టి చంపుతాం

## అఫ్గాన్ మహిళలకు తాలిబాన్ల హెచ్చరిక

అఫ్గానిస్తాన్‌లో మధ్యయుగాల నాటి ఛాందసవాద పాలనకు తెరలేపిన తాలిబాన్లు ప్రజల పట్ల మరింత దారుణంగా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా మహిళలపై కఠిన ఆంక్షల కొరడాను మరోసారి ఝులిపించారు. వివాహేతర సంబంధం, వ్యభిచారానికి ఒడిగట్టే మహిళలను బహిరంగంగా రాళ్లతో కొట్టి చంపుతామని తాలిబాన్లు హెచ్చరించారు. ఈ మేరకు తాలిబాన్ల సుప్రీం లీడర్ ముల్లా హిబాతుల్లా అకుంద్‌జాదా అఫ్గాన్లనుద్దేశిస్తూ ప్రభుత్వ టీవీ చానెల్‌లో శనివారం ఒక ఆడియో సందేశం ఇచ్చారు. "అంతర్జాతీయ సమాజం చెబుతున్నట్లు మహిళలకు హక్కులు ఉండాలంటారా? అవి మన ఇస్లామిక్ షరియా చట్టాలు, మన మతాధికారుల నియమాలకు వ్యతిరేకం. మేం చాయ్ తాగుతూ చూస్తూ ఊరుకుంటామని అనుకుంటున్నారేమో! ఈ నేలపై షరియా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి తీరతాం. వివాహేతర సంబంధాలు, వ్యభిచారం ఘటనల్లో మహిళలను అందరూ చూస్తుండగా కొయ్యకు కట్టేసి రాళ్లతో కొట్టి చంపుతాం" అని అకుంద్‌జాదా హెచ్చరించారు.



# "టక్ జగదీష్" నటుడు డానియల్ బాలాజీ కన్నుమూత



మన సౌత్ ఇండియా సినిమా దగ్గర పలు తక్కువ చిత్రాల్లోనే కనిపించినప్పటికీ విలన్ గా తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న టాలెంటెడ్ నటుల్లో కోలీవుడ్ నటుడు డానియల్ బాలాజీ కూడా ఒకరు. మరి టాలీవుడ్ లో మెగాపవర్ స్టార్ రాం చరణ్ నటించిన డెబ్యూ చిత్రం "చిరుత" లోనే విలన్ పాత్రలో ఆకట్టుకున్న తాను మళ్లీ నేచురల్ స్టార్ నాని "టక్ జగదీష్"లో విలన్ గా మెప్పించాడు. అయితే అప్పటి నుంచి ఇప్పుడు వరకు కూడా ఫిజికల్ గా కూడా తనలో పెద్దగా ఎలాంటి మార్పు లేదు. మరి అలాంటిది ఈ నటుడు ఇప్పుడు లేడు అనే వార్త విషాదంగా మారింది. తాను నిన్న శుక్రవారం రాత్రి గుండెపోటు కారణంగా కేవలం తన 48వ ఏట కన్ను మూసినట్టుగా తమిళ వర్గాలు ఖరారు చేసాయి. మరి చెన్నై లోని కొట్టివాకమ్ ఆసుపత్రిలో తాను చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు అని తెలుస్తోంది. దీనితో ఈ వార్త విన్న వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. మరి తన అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో తెలియజేస్తున్నారు. మరి తన పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని మా 123తెలుగు యూనిట్ కూడా ఆకాంక్షిస్తుంది.



## సిద్దరామయ్య కొడుకుపై బీజేపీ నేతలు ఫైర్

సార్వత్రిక ఎన్నికల ప్రచార హోరు జోరుగా సాగుతున్న తరుణంలో.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు 'యతీంద్ర సిద్ధరామయ్య' ప్రధానమంత్రి మోదీపైన కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీని, ఆయన ఇంటిని కించపరిచే పదజాలంతో దూషించారని పార్టీ నేతలు మండిపడ్డారు. చామరాజనగర జిల్లా హనూర్ పట్టణంలో జరిగిన పార్టీ సమావేశంలో యతీంద్ర సిద్ధ రామయ్య చేసిన వ్యాఖ్యలు ఎలక్షన్ కమీషన్ జారీ చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మార్గదర్శకాలను ఉల్లంఘించాయని ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో బీజేపీ రాష్ట్ర విభాగం ఆరోపించింది. రాజకీయ నేతలపై వ్యక్తిగత దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదని, యతీంద్ర సిద్ధ రామయ్య వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. హోం మంత్రి అమిత్ షాను 'గూండా' అని, ఆయన నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని యతీంద్ర సిద్ధ రామయ్య అన్నారు. అంతే కాకుండా నేర చరిత్ర ఉన్న వారితో మోదీ సహవాసం చేస్తున్నారని ఆరోపించారు. యతీంద్ర సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు సబబు కాదని, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. శాసనస భ్యుడిగా పనిచేసి.. ఒక ముఖ్యమంత్రి కుమారుడు అయిన వ్యక్తికి ఇలాంటి వ్యాఖ్యలు తగవని అన్నారు. యతీంద్ర సిద్ధ రామయ్య తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని కోరారు.



## ఢిల్లీ మంత్రిని విచారించిన 'ఈడీ'

లిక్కర్ కేసులో ఆమ్ఆద్మీపార్టీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నీడలా వెంటాడుతోంది. ఇప్పటికే ఈ కేసులో పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ తాజాగా ఢిల్లీ ప్రభుత్వంలోని మరో మంత్రి కైలాష్ గెహ్లోట్‌ను శనివారం విచారించింది. రద్దయిన వివాదాస్పద లిక్కర్ పాలసీ 2021-22 రూపొందించడంలో కైలాష్‌గెహ్లోట్ కూడా కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్‌లో గెహ్లోట్ సభ్యులుగా ఉన్నారు. లిక్కర్ పాలసీని అధికారికంగా వెల్లడించకముందే సౌత్ గ్రూప్‌నకు పాలసీ డ్రాఫ్ట్ లీకయిందని ఈడీ ఆరోపిస్తోంది. పాలసీ రూపొందిస్తున్న సమయంలో గెహ్లోట్ తన అధికారిక నివాసాన్ని వాడుకోవడానికి ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్‌నాయర్‌కు అనుమతిచ్చారని, ఇంతేగాక గెహ్లోట్ తన మొబైల్ నంబర్లను పదే పదే మార్చారని ఈడీ చెబుతోంది. ఈ నేపథ్యంలో గెహ్లోట్‌ను ఈడీ విచారించడం చర్చనీయాంశమైంది.




## ఆటో బోల్తా.. 30 మంది కూలీలకు తీవ్రగాయాలు

పరిమితికి మించి ప్రయాణం.. మితిమీరిన వేగం.. ప్రమాదానికి కారణమైంది. పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న కూలీలను గాయాల పాలు చేసింది. కర్నూలు జిల్లా ఆలూరు మండలం హత్తిబెళగల్ సమీపంలో టైరు పగిలి కూలీలు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 30 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను ఆలూరు ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం చిప్పగిరి మండలంలో 30 మంది కూలీలు ట్రాలీ ఆటోలో కూలీకి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ఆలూరు మండలం వులేబీడువాసులుగా గుర్తించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. తృటిలో ప్రమాదం తప్పిందని బాధితులు పేర్కొన్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇన్స్పెక్టర్ రిషి ఓటీటీ రివ్యూ

ఇటీవల ఓటిటి కంటెంట్ గా మన సౌత్ నుంచి రానున్న ఓ సిరీస్ ఇంట్రెస్టింగ్ ట్రైలర్ తో ఆసక్తి రేపింది. నటుడు నవీన్ చంద్ర మెయిన్ లీడ్ లో నటించిన ఆ సూపర్ నాచురల్ థ్రిల్లర్ సిరీస్ నే "ఇన్స్పెక్టర్ రిషి". తమిళ్ లో తెరకెక్కించిన ఈ సిరీస్ తెలుగు సహా పాన్ ఇండియా భాషల్లో ఇప్పుడు అమెజాన్ యాప్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కి వచ్చింది. మరి ఈ సిరీస్ ఓటిటి వీక్షకులని మెప్పించిందా లేదా అనేది సమీక్షలో చూద్దాం రండి.




కథ: ఇక ఈ సిరీస్ కథలోకి వస్తే.. కోయం బత్తూర్ తేంకాడు అనే ఓ దట్టమైన అటవీ ప్రాంతమైన గ్రామంలో ప్రజలు అనుమానాస్పద రీతిలో మరణిస్తూ ఉంటారు. మరి మిస్టరీని ఛేదించేందుకు క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రిషి నందన్(నవీన్ చంద్ర) అలాగే సబ్ ఇన్స్పెక్టర్ అయ్యానార్ (కన్నా రవి), చైత్ర (మాలిని జీవరత్నం) లు రంగంలోకి దిగుతారు. మరి ఆ గ్రామంలో జరుగునున్న మిస్టరీ మరణాలు వెనుక ఉన్నది ఎవరు? ఆ అడవి ప్రజలు దేవతగా కొలిచే వనరాచినే ఇవన్నీ చేస్తుందా లేక అసలు కారణాలు ఏంటి? వీటికి ఓ పరిష్కారం దొరికిందా లేదా? రిషి ఇన్వెస్టిగేషన్ ని ఛేదించాడా అనేది తెలియాలి అంటే ఈ సిరీస్ చూడాలి.

ప్లస్ పాయింట్స్: ఈ సిరీస్ లో నటీనటులు మాత్రం సాలిడ్ పెర్ఫామెన్స్ లు అందించారు అని చెప్పాలి. మొదటిగా నవీన్ చంద్ర నుంచే చెప్పుకుంటే ఇప్పటికే తాను చాలా ఇంటెన్స్ పాత్రలు పోషించాడు. కొన్ని సిన్సియర్ అటెంప్ట్స్ లో ఈ రిషి రోల్ కూడా ఒకటని చెప్పాలి. తన కేసు విషయంలో కమిట్ అయ్యి ఎంత దూరమైనా వెళ్లగలిగే సిన్సియర్ పోలీస్ గా ఈ సిరీస్ లో తాను ఆకట్టుకుంటాడు. అలాగే నటి సునైనా డీసెంట్ ప్[పాత్రలో కనిపిస్తుంది. ఓ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా తనలోని లోతైన హావ భావాలను వ్యక్తం చేసింది. ఇక వీరితో పాటుగా ఇతర ముఖ్య పాత్రధారులు మాలిని జీవరత్నం, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్ తదితరులు తమ పాత్రలకి న్యాయం చేకూర్చారు.

మైనస్ పాయింట్స్: ఈ సిరీస్ లో పెద్ద డిజప్పాయింటింగ్ అంశం ఏదన్నా ఉంది అంటే అసలు ఈ సిరీస్ కథాంశమే అని చెప్పాలి. చాలా రొటీన్ గా ఆల్రెడీ చూసినట్టుగానే ఈ సిరీస్ లో లైన్ అనిపిస్తుంది. ఒక ప్రాపర్ థ్రిల్లర్, హారర్ కానీ సస్పెన్స్ ఎలిమెంట్స్ ఇందులో అసలు ఏమాత్రం ఆకట్టుకోవు. ట్రైలర్ లో కొన్ని సీన్స్ ఆసక్తిగా అనిపించి ఉండొచ్చు కానీ సిరీస్ చూస్తే అసలు వాటిలో మేటర్ లేదని అర్ధం అయ్యిపోతుంది. ఇంకా ఈ సిరీస్ ని అనవసరంగా బాగా సాగదీసినట్టుగా అనిపిస్తుంది. ముఖ్యంగా మొదటి 5 ఎపిసోడ్స్ అయితే దారుణంగా సాగదీశారు. వీటితో చూసే ఆడియెన్స్ కి బాగా బోర్ అనిపిస్తుంది. అలాగే ఈ ఒక్క సిరీస్ ని కంప్లీట్ చెయ్యడానికి 8 గంటలు సమయం కేటాయించాలి. కానీ మొత్తం చూసాక ఈ సమయమంతా వృధా అనిపించక మానదు. అలాగే హారర్ ఎలిమెంట్స్ ఏమాత్రం మెప్పించవు ఆల్రెడీ చూసేసినట్టుగానే అనిపిస్తాయి దీనితో అసలు కొత్తదనం కనిపించదు. సస్పెన్స్ ఫ్యాక్టర్ మైంటైన్ చేయడంలో కూడా ఈ సిరీస్ విఫలం అయ్యింది. వీటితో పాటుగా కొన్ని సీన్స్ లో అసలు నేటివిటీ మిస్ అయ్యినట్టు అనిపిస్తుంది. జెనరల్ గా డబ్ వెర్షన్ లో ఆయా నేటివిటీకి తగ్గట్టుగా మార్పులు ఉండాలి కానీ డబ్బింగ్ వెర్షన్ లో కూడా ఒరిజినల్ వెర్షన్ ని ఉంచేశారు. ఇక ఈ సిరీస్ లో ఎక్కువ పాత్రలు వాటి సబ్ ప్లాట్ లు లాంటివి మరింత నీరసం తెప్పిస్తాయి.

సాంకేతిక వర్గం: ఈ సిరీస్ లో నిర్మాణ విలువలు బాగున్నాయి. మెయిన్ గా ఆర్ట్ వర్క్ ఇంప్రెస్ చేస్తుంది. పలు సెట్టింగ్స్ నాచురల్ విజువల్స్ బాగున్నాయి. టెక్నీకల్ టీం లో మ్యూజిక్ వర్క్ బాగాలేదు. ఈ తరహా సిరీస్ లకి ప్రభావవితం చేసే నేపథ్య గీతం ముఖ్యం అది ఏమాత్రం ఆకట్టుకోదు. సినిమాటోగ్రఫీ బాగానే ఉంది. ఎడిటింగ్ లో చాలా సీన్స్ కట్ చేయాల్సింది. తెలుగు డబ్బింగ్ ని ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకులు జే ఎస్ నందిని విషయానికి వస్తే.. తాను ఏదో అనుకోని థ్రిల్ చేయడానికి ట్రై చేసిన ఈ సిరీస్ లో అది తప్ప అనవసర అంశాలు ఎక్కువయ్యిట్టుగా అనిపిస్తుంది. వీటితో తన వర్క్ ఈ సిరీస్ కి నిరాశ పరుస్తుంది. చాలా వీక్ కథా, కథనాలతో తాను ఈ సిరీస్ ని డల్ గా నడిపించారు.

తీర్పు: ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "ఇన్స్పెక్టర్ రిషి" లో నవీన్ చంద్ర మరోసారి నటుడుగా ఆకట్టుకుంటాడు అలాగే తనతో పాటుగా ఇతర పాత్రధారులు మంచి పెర్ఫామెన్స్ లు అందించారు కానీ అల్టిమేట్ లో సిరీస్ లో విషయంలో తేలిపోయింది. దీనితో కొందరిలో అయినా మంచి ఆసక్తి రేకెత్తించిన ఈ సిరీస్ ఓవరాల్ గా బాగా డిజప్పాయింట్ చేస్తుంది. సరైన కథ, కథనాలు సిరీస్ లో లోపించాయి. వీటితో ఈ సిరీస్ కి దూరంగా ఉండడమే మంచిది.

## నిన్న దానం.. నేడు కడియం..
# అనర్హత వేటుపై బీఆర్ఎస్ పిటిషన్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. వెంటనే కాంగ్రెస్ గేట్లు తెరిచింది. బీఆర్ఎస్, బీజేపీ నేతలంతా కాంగ్రెస్ పార్టీకి క్యూ కట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీల్లో మెజారిటీ నేతలు కాంగ్రెస్‌లో ఎదిగిన వారే కావడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్న నేతల జాబితా పెద్దదే. కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేసి, ప్రస్తుతం బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్‌గా కొనసాగుతున్న కె.కేశవరావు మళ్లీ మాతృపార్టీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన తన కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఇదే బాటలో కడియం శ్రీహరి ఉన్నారు. నేడో, రేపో కడియం కూడా బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ కండువా కప్పకోనున్నారు. త్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు సిద్దంగా ఉన్ననని కూడా ఆయన ప్రకటించారు. అయితే కడియం పార్టీ మార్పుపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్దమైంది. ఈనేపథ్యంలో అసెంబ్లీ కి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్మ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ చేరుకున్నారు. అయితే.. స్పీకర్ అందుబాటులో లేరని అసెంబ్లీ సిబ్బంది చెబుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సెక్రటరీని కలిసే ప్రయత్నంలో బీఆర్ఎస్ నేతలు సిద్దమయ్యారు.





అయితే తాజాగా.. ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరిన విషయం తెలిసిందే. అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు స్పీకర్ ను కలిశామని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో పాడి కౌశిక్ రెడ్డితో పాటు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం రాజ్యాంగాన్ని గౌరవిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మూడు నెలల్లో దానం పై అనర్హత వేటు పడటం ఖాయమన్నారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీ లోకి వెళ్లటం సమంజసం కాదని తెలిపారు. రేవంత్ రెడ్డి గతంలో పార్టీ మారిన వాళ్లని రాళ్లతో కొట్టండి అంటూ చెప్పాడని గుర్తు చేశారు. అదే రేవంత్ రెడ్డి దానం ను బీడీ లు అమ్ముకునే వాడు అని చెప్పాడని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ లో చేర్చుకున్నారు అదే బీడీలు అమ్మిస్తారా? అని ప్రశ్నిస్తారు.




## వాళ్లిద్దరికి ఆస్కార్ ఇవ్వాలి: టీమిండియా దిగ్గజం షాకింగ్ కామెంట్

ఐపీఎల్-2024.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ సందర్భంగా ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఆర్సీబీ స్టార్ విరాట్ కోహ్లి- కేకేఆర్ మెంటార్ గౌతం గంభీర్ ఒకరినొకరు ఆత్మీయంగా హత్తుకున్నారు. దశాబ్దకాలంగా కోహ్లి- గంభీర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. గౌతీ కేకేఆర్ ఆటగాడిగా ఉన్న సమయంలోనే కోహ్లి ఓసారి మైదానంలో అతడితో వాగ్వాదానికి దిగాడు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య వైరం నడుస్తోంది. ఇక గతేడాది లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా ఉన్న గంభీర్.. ఆర్సీబీతో మ్యాచ్ సందర్భంగా కోహ్లి- నవీన్ ఉల్ హక్(లక్నో బౌలర్) గొడవలో తలదూర్చాడు. దీంతో కోహ్లి సైతం దీటుగా బదులిస్తూ గంభీర్‌కు కౌంటర్ వేశాడు. క్రికెట్ వర్గాలను విస్మయ పరిచిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో కోహ్లి- గంభీర్ తప్పొప్పలను ఎంచుతూ మాజీ క్రికెటర్లు,. అభిమానులు రెండు గ్రూపులుగా విడిపోయారు.




## నితిన్ తమ్ముడు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

టాలీవుడ్ హీరో నితిన్ నేడు (మార్చి 30) 41వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా తన కొత్త చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వకీల్ సాబ్ సినిమా డైరెక్టర్ వేణు శ్రీరామ్ కాంబినేషన్‌లో నితిన్ ఒక ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'తమ్ముడు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసిన మేకర్స్.. నేడు నితిన్ పుట్టినరోజు కావడంతో ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాని దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇది శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మితమవుతున్న 56వ సినిమాగా రాబోతుంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇప్పుడు విడుదల చేసిన పోస్టర్‌లో నితిన్ కాస్త డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆడవాళ్లు లారీ తోలుతుంటే లారీపై కుమారస్వామి ఆయుధం పట్టుకొని నితిన్ కూర్చున్నాడు. భారీ యాక్షన్ ఎపిసోడ్‌కు సంబంధించిన సీన్ నుంచి ఈ పోస్టర్‌ను విడుదల చేసినట్లు తెలుస్తోంది. నితిన్- దర్శకుడు విక్రమ్ కే కుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాను రానుంది. వీరిద్దరి కాంబోలో ఇష్క్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమాతో నితిన్ భారీ హిట్ అందుకున్నాడు.




## రాబిన్ హుడ్‌లో మరో కొత్త ముఖంతో నితిన్!

రైన్మెంట్ ని కన్ఫర్మ్ చేయగా దానితోనే ఈ సినిమాకి నితిన్ చేసిన ఇంట్రెస్టింగ్ మేకోవర్ ని కూడా రివీల్ చేశారు. అయితే ఇప్పుడు ఈరోజు నితిన్ బర్త్ డే కానుకగా మేకర్స్ మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని రివీల్ చేశారు. దీనితో మొదటి లుక్ కి దీనికి ఎలాంటి సంబంధం లేకుండా ఫ్రెష్ గా ఉందని చెప్పాలి. అలాగే మేకర్స్ ఈ పాత్రని ఏజెంట్ అంటూ రివీల్ చేయడం గమనార్హం. మరి ఈ ఏజెంట్ టైటిల్ కి తగ్గట్టుగానే నితిన్ ఈ కొత్త లుక్స్ లో స్టైలిష్ గా అదిరిపోయాడు. మరి రాబిన్ హుడ్ గా నితిన్ ఇంకెన్ని సర్ప్రైజ్ లు చూపిస్తాడో చూడాలి. ఇక ఈ చిత్రానికి జివి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే అతి త్వరలోనే సినిమాని మేకర్స్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.